

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 32 | హైదరాబాద్ | మంగళవారం | 21-07-2026 | పేజీలు: 08


## రాహుల్ 56 ఏండ్ల యువకుడు

పార్లమెంటులో ప్రధాని మోదీ చురకలు

వర్షా కాల సమావేశాలు ఫలవంతంగా సాగాలని ఆకాంక్ష

విక్రమ్-1' విజయంపై స్కైరూట్ బృందానికి అభినందనలు

28 ఏళ్ల యువ ఆవిష్కర్తల ప్రతిభకు ప్రధాని ప్రశంసలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి కీలక సందేశం ఇచ్చారు. వర్షాకాలం మాదిరిగానే వర్షాకాల సమావేశాలు కూడా చురుగ్గా, ఫలవంతంగా సాగితేనే దేశానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులకు మిగతా 2లో..



## చలో పార్లమెంట్ ఉద్రిక్తం..

నిరసనకారులపై లాఠీఛార్జి

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

బారికేడ్లు దాటేందుకు యత్నించిన ఆందోళనకారులు..

భాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు

అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ..

నిరసన నేతలతో జేపీ నడ్డా చర్చలు

02



## త్వరలో ఆర్టీసీ విలీనం!

మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఒక్కొక్క సమస్యకూ శాశ్వత పరిష్కారం

సంస్థను లాభాల బాట పట్టిస్తామన్న పొన్నం

మూడు ప్రధాన సూత్రాలతో ముందుకు

ఎన్నికల అనంతరం విలీన ప్రక్రియ

కార్మిక సంఘాల పునరుద్ధరణపై కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ)ని బలోపేతం చేసేందుకు మరియు కార్మికుల సమస్యలను రూపుమాపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆర్టీసీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన ఒక్కొక్క సమస్యను తాము చొరవ తీసుకుని పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు. సంస్థను కేవలం లాభాల కోణంలోనే కాకుండా, ప్రజలకు సేవ చేసే ఒక పవిత్రమైన సాధనంగా చూస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో ఆర్టీసీని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు యాజమాన్యం నిరంతరం మిగతా 2లో..

## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది

పోచారం పార్టీ మార్పుపై

కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

"బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా

ఎగరాల్సిన సమయం వచ్చింది"

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు

అమలు చేయలేదని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శల వర్షం

రైతులకు యూరియా

కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

కాళేశ్వరం మరమ్మతుల్లో

జాప్యంపై ప్రభుత్వంపై విమర్శలు

రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌లో..

ప్రభుత్వం 'కోల్డ్ స్టోరేజ్'లో: కేటీఆర్

కేసీఆర్ పాలనలో ఇచ్చిన ఉద్యోగాలపై

కాంగ్రెస్ ఘనత చెప్పుకుంటోందని ఆరోపణ

ప్రజలకు ఇచ్చిన హామీలు

వెంటనే అమలు చేయాలని డిమాండ్

తెలంగాణ కోసం ప్రాణాలైనా

ఇస్తామని బీఆర్ఎస్ సంకల్పం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీ ప్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. "కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

"ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారను" అని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును మిగతా 2లో..



## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్.. కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

ఢిల్లీలో నీట్ విద్యార్థుల

ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్

కేంద్ర ప్రభుత్వ వైఖరిని

తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రశ్నిస్తున్న యువతపై దాడులు

బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం

కేంద్ర విద్యాశాఖ మంత్రి

రాజీనామా చేయాలని డిమాండ్

విద్యార్థులకు అండగా

ఉంటానని స్పష్టం చేసిన రేవంత్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు మిగతా 2లో..

## దీక్ష విరమణకు మూడు షరతులు

సోనమ్ వాంగ్‌చుక్ కీలక ప్రకటన

20 రోజులకు పైగా నిరాహార దీక్ష..

ప్రభుత్వానికి మూడు డిమాండ్లు

నీట్ పేపర్ లీక్‌పై బాధ్యత

వహించాలని కేంద్రానికి డిమాండ్

ఆసుపత్రిలో అక్రమ నిర్బంధమని

ఆరోపణ.. పార్లమెంట్

మార్చ్‌కు ప్రజలకు పిలుపు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

వ్యవస్థలోని వైఫల్యాలు, విద్యా రంగంలో అవినీతికి నిరసనగా 20 రోజులకు పైగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తన దీక్ష విరమణకు మూడు కీలక షరతులు విధించారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరిస్తే సోమవారమే తన నిరాహార దీక్షను ముగిస్తానని ప్రకటించారు. దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో తనను అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ విడుదల చేసిన లేఖలో ఈ విషయాలను మిగతా 2లో..



## క్యూర్ పరిధిలో లక్ష గృహాల విప్లవం

ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నగర పేదల సొంతింటి కలకు ప్రభుత్వం శ్రీకారం

తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం

జూలై 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు

మీసేవ, వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ ద్వారా అప్లై

రూ. 4060 లక్షల విలువైన స్థలం పూర్తిగా ఉచితం

ఆడపడుచుల పేరిటే రిజిస్ట్రేషన్

10 ఏళ్ల వరకు అమ్మకంపై నిషేధం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

హైదరాబాద్ మహానగర పరిధిలోని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. 'క్యూర్' పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నాడు సచివాలయంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రయోగాత్మకంగా, నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రభుత్వం అత్యంత సులభతరం చేసింది. జూలై 21వ తేదీ నుండి మిగతా 2లో..



## డయల్ యువర్ ఎమ్మెల్యేకు జనం జేజేలు

నేరుగా ఫోన్ లైన్లోకి

మంత్రి కొండా సురేఖ

సమస్యల పరిష్కారానికి

అధికారులకు ఆదేశాలు

సీఎం ఆశయాలకు

అనుగుణంగా

నూతన కార్యక్రమం

జనం చెంతకు

చేరిన ప్రజా ప్రభుత్వం

లైన్లోకి వచ్చిన

వందలాది ఫోన్ కాల్స్

రెవెన్యూ, డ్రైనేజీ, పెన్షన్ల

సమస్యలపై వినతులు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గర కావాలనే లక్ష్యంతో సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించే క్రమంలో "డయల్ యువర్ ఎమ్మెల్యే" అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల నుంచి ఊహించని రీతిలో భారీ స్పందన లభించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల లబ్ధిదారులకు, పాలకులకు మధ్య ఉన్న దూరం పూర్తిగా తగ్గిపోయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా ఫోన్ కాల్స్‌లో అందుబాటులోకి వచ్చి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని మిగతా 2లో..

# చలో పార్లమెంట్ ఉద్రిక్తం..

- చలో పార్లమెంట్' ఉద్రిక్తం..
- నిరసనకారులపై లాఠీఛార్జి
- నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- బారికేడ్లు దాటేందుకు యత్నించిన ఆందోళనకారులు..
- భాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు
- అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ..
- నిరసన నేతలతో జేపీ నడ్డా చర్చలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజున నిర్వహించిన ఈ నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ, పెద్ద సంఖ్యలో నిరసనకారులు పార్లమెంట్ వైపు కదలడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**బారికేడ్లు దాటిన నిరసనకారులు**

పార్లమెంట్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు, నిరసనకారులను పలుచోట్ల అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, ఆందోళనకారులు బారికేడ్లను దాటి పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించారు. దీంతో పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. భాష్పవాయువు గోళాలను కూడా ప్రయోగించారు. పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో కొందరు పోలీసు సిబ్బందికి కూడా గాయాలైనట్లు తెలుస్తోంది.

**అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ**

ఈ పరిణామాల మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల జరిగిన ఈ సమావేశంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, పార్లమెంట్‌లో ప్రభుత్వ వ్యూహంపై చర్చ జరిగినట్లు



జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

**నిరసన నేతలతో జేపీ నడ్డా చర్చలు**

'చలో పార్లమెంట్' ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న ప్రతినిధులతో కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. అనంతరం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా నిరసనకారుల ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఆందోళనలను శాంతియుతంగా పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

**సోనమ్ వాంగ్‌చుక్‌ను కలవనున్న నడ్డా**

ఇదిలా ఉండగా, 20 రోజులకుపైగా నిరాహార దీక్ష కొనసాగిస్తూ ప్రస్తుతం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా పరామర్శించనున్నట్లు సమాచారం. వాంగ్‌చుక్ ఇటీవల తన దీక్ష విరమణకు మూడు షరతులు విధించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

# త్వరలో ఆర్టీసీ విలీనం!

మొదటిపేజీ తరువాయి

శ్రమిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ కోలా శంకర్ ఉదంతం ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర ఆవేదనను నింపింది. ఈ నేపథ్యంలో, కష్టాల్లో ఉన్న సదరు కార్మిక కుటుంబానికి అండగా నిలిచేందుకు టీజీఆర్టీసీ ఉద్యోగులు వినూత్నంగా స్పందించారు. 'ఉద్యోగుల చేయూత' అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా సేకరించిన రూ. 90 లక్షల 85 వేల 500 రూపాయల భారీ ఆర్థిక సహాయం చెక్కును హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు.

డ్రైవర్ కోలా శంకర్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న సమయంలో తాను స్వయంగా అర్ధరాత్రి వేళ ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల చికిత్సను అడిగి తెలుసుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శంకర్ అకాల మరణం తనను ఎంతగానో కలచివేసిందన్నారు. ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు ప్రభుత్వం తరఫున ఒక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, శంకర్ కుమారుడైన హేమంత్‌కు ఆర్టీసీ సంస్థలోనే త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మూడు అత్యంత ప్రధానమైన సూత్రాలను బేస్ చేసుకుని ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మొదటిది సంస్థ పరిరక్షణ, రెండోది ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధునాతన సౌకర్యాలు కల్పించడం, మూడోది కంటికి రెప్పలా కాపాడే కార్మికుల సంక్షేమం చూసుకోవడం అని చెప్పారు. ఈ మూడు అంశాలే ప్రాతిపదికగా తాము రాత్రింబవళ్లు శ్రమిస్తున్నామని, ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలోని కార్మిక సంఘాలను పూర్తిగా ఎత్తివేసి, కార్మికుల హక్కులను కాలరాస్తూ నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కానీ తమ ప్రభుత్వం రాగానే ప్రజాస్వామ్యబద్ధంగా కార్మికులకు తమ గళాన్ని వినిపించే హక్కును కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే త్వరలోనే ఆర్టీసీలో అధికారికంగా యూనియన్ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసిన వెంటనే, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా వేగవంతం చేస్తామని కార్మికులకు పెద్ద ఊరటనిచ్చే ప్రకటన చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆర్టీసీ చరిత్రనే మార్చేసిందని మంత్రి కొనియాడారు. ఈ పథకం వల్ల కోట్లాది మంది మహిళలు ప్రతిరోజూ ఉచితంగా, సురక్షితంగా ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై సామాన్య ప్రజల్లో ఆదరణ మరియు నమ్మకం వంద రెట్లు పెరిగిందన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన టికెట్ డబ్బులను ప్రభుత్వం ఏ నెలకు ఆ నెల అత్యంత పారదర్శకంగా ఆర్టీసీ సంస్థకు విడుదల చేస్తోందని, ఇందుకోసం నెలకు రూ. 300 కోట్ల నిధులను నేరుగా ఇస్తోందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ మహానగరంలో నివసిస్తున్న ప్రయాణికుల సౌకర్యార్థం రవాణా వ్యవస్థలో సరికొత్త మార్పులు తీసుకువస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సు సర్వీసులను నగరంలోని మెట్రో రైలు స్టేషన్లతో మరియు ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లతో పూర్తిగా అనుసంధానం (ఇంటిగ్రేషన్) చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ప్రయాణ సమయం బాగా కలిసి వస్తుందన్నారు. అలాగే, నగరంలోని కీలకమైన క్యూర్ ఏరియా పరిధిలో ప్రయాణికుల కోసం అన్ని హంగులతో కూడిన ఒక భారీ సరికొత్త బస్ టెర్మినల్‌ను నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు. అందుకోసం పల్లెల నుండి నేరుగా రాజధాని హైదరాబాద్ నగరానికి కనెక్టివిటీ ఉండేలా ఎన్నో కొత్త రూట్‌లను గుర్తించి, వందలాది కొత్త బస్సులను రోడ్లపైకి తీసుకొచ్చామని వివరించారు. ఆర్టీసీ అనేది కేవలం ఒక సంస్థ కాదు, అది ప్రతి పేదవాడి గుండె చప్పుడు అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. చివరగా, సంస్థను నమ్ముకుని రిటైర్ అయిన పాత కార్మికుల పెండింగ్ సమస్యలు, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి విషయాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, వారి సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

# రాహుల్ 56 ఏండ్ల యువకుడు

మొదటిపేజీ తరువాయి



తావులేకుండా సార్థకమైన చర్చలు జరగాలని ఆకాంక్షించారు. అదే సమయంలో భారత అంతరిక్ష రంగంలో మరో మైలురాయిగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్ 1' ప్రయోగ విజయాన్ని ప్రశంసిస్తూ, యువ ఆవిష్కర్తల ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై పరోక్షంగా వ్యంగ్య వ్యాఖ్యలు కూడా చేశారు.

**చర్చలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం**

పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, దేశాభివృద్ధికి శాసనసభలలో జరిగే చర్చలు ఎంతో కీలకమని అన్నారు. ''వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు రెండూ చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులంతా ప్రజల సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరిపి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**స్కైరూట్ విజయంపై హర్షం**

భారత ప్రైవేటు అంతరిక్ష రంగానికి గర్వకారణమైన స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్ 1' విజయాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ విజయం కేవలం ఒక సంస్థకే పరిమితం కాదని, భారత యువత సామర్థ్యానికి నిదర్శనమని కొనియాడారు. ప్రపంచంలో కొద్ది దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు రాకెట్ సంస్థలు ఉన్నాయని, అలాంటి ఘనతను భారత స్టార్టప్ సాధించడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

**28 ఏళ్ల యువతకు ప్రశంసలు**

స్కైరూట్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని గుర్తుచేసిన ప్రధాని, యువత ప్రతిభకు ఇది నిదర్శనమన్నారు. "ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా ఏ రంగాన్ని చూసినా భారత విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. గత ఏడాది వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు భారతీయ స్టార్టప్ స్కైరూట్ మరో అద్భుత విజయాన్ని నమోదు చేసింది" అని వ్యాఖ్యానించారు.

**రాహుల్‌పై పరోక్ష చురకలు**

ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లు. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. యువత సాధించిన విజయాలు యాదృచ్ఛికం కాదని, వారి సామర్థ్యం, సృజనాత్మకత, ఆకాంక్షలకు అవి ప్రతిబింబమని అన్నారు.

**అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తోంది**

గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష రంగంలో సంస్కరణలు చేపట్టి ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించిందని ప్రధాని గుర్తు చేశారు. దాని ఫలితంగానే స్కైరూట్ వంటి భారతీయ స్టార్టప్‌లు ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుతున్నాయని పేర్కొన్నారు. యువత కలలు కనే భారత్ నుంచి, వాటిని సాకారం చేసే భారత్‌గా దేశం ఎదుగుతోందని మోదీ అన్నారు.

# 'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు జనం జేజేలు

మొదటిపేజీ తరువాయి

పలు జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు మంత్రికి ఫోన్ చేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ముఖ్యంగా రెవెన్యూ వివాదాలు, భూ సమస్యలు, తాగునీటి ఎద్దడి, అంతర్గత రహదారులు, పబ్లిక్ టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం, విద్యుత్ సరఫరా లోపాలు, ఇందిరమ్మ ఇండ్లు, శ్మశానవాటికల కొరత, మౌలిక సదుపాయాలు మరియు వృద్ధాప్య పెన్షన్ల వంటి అనేక అంశాలపై ప్రజలు మంత్రి దృష్టికి సమస్యలను తీసుకొచ్చారు.

ఫోన్ లైన్లోకి వచ్చిన ప్రతి ఒక్కరి బాధను మంత్రి కొండా సురేఖ ఎంతో ఓపికగా, సానుభూతితో విన్నారు. సమస్య తీవ్రతను బట్టి ఆమె కేవలం వినడం మాత్రమే కాకుండా తక్షణమే రంగంలోకి దిగారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్నలతో పాటు పలువురు ఉన్నతాధికారులతో మంత్రి అప్పటికప్పుడే ఫోన్ లో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రాధాన్యత క్రమంలో (టాప్ ప్రయారిటీ) తీసుకుని, క్షేత్ర స్థాయికి వెళ్లి విచారణ జరిపి శరవేగంగా పరిష్కరించాలని ఆన్ ది స్పాట్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం విజయవంతం అయిన అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ఒక సాధారణ ప్రజాప్రతినిధిగా ప్రజలు నన్ను గుర్తిస్తారని, అది నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని వంద శాతం నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ఫోన్ లో ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను తన సొంత కుటుంబ సమస్యగా భావించి, దాని శాశ్వత పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్క నిరుపేదకూ ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కేవలం ఫోన్ ద్వారానే కాకుండా, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ నిరంతరం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తాను మరియు తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఇద్దరూ కలిసి ప్రతిరోజూ ఉదయం నుంచే నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా వినతులు, దరఖాస్తులను (అప్లికేషన్లు) స్వీకరిస్తున్నామని చెప్పారు. స్థానికంగా వచ్చే సమస్యలపై సంబంధిత శాఖల అధికారులను అక్కడికక్కడే పిలిపించి మాట్లాడి, సాధ్యమైనంత తక్కువ సమయంలో సమస్యలు క్లియర్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

తాను ఎక్కడ ఉన్నా తన ప్రాధాన్యత ఎప్పుడూ ప్రజలకే ఉంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ లోనే కాకుండా, హైదరాబాద్ సచివాలయం (సెక్రటేరియట్) లోని తన అధికారిక చాంబర్‌లోనూ, జూబ్లీహిల్స్‌లోని తన సొంత నివాసంలోనూ, అలాగే బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలోనూ నిరంతరం అవసరార్థులు, పార్టీ కార్యకర్తలు, సాధారణ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం (కోఆర్డినేషన్) చేసుకుంటూ ఆయా ఫైళ్లను వేగంగా క్లియర్ చేయిస్తున్నట్లు మంత్రి వివరించారు.

రాజకీయాల్లో పదవులనేవి శాశ్వతం కాదనే నిజాన్ని మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తు చేశారు. "నాకు పదవులతో అసలు సంబంధం లేదు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, వారి కష్టాలు తీర్చడంలోనే నేను నిజమైన ఆనందాన్ని, తృప్తిని వెతుక్కుంటున్నాను. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కారమై, వారు సంతోషంగా వెళ్లేటప్పుడు వారి ముఖాల్లో కనిపించే చిరునవ్వే నాకు లభించే అసలైన అవార్డు" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయడం తన ప్రాథమిక బాధ్యత అని, వారి నమ్మకాన్ని కాపాడటమే తన కర్తవ్యమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, సామాన్యుడి కష్టాలను తీర్చడమే ఈ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. గత పాలకుల లాగా కాకుండా, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన, అత్యంత పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పాలనను అందించడమే తమ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను మరిన్నింటిని చేపట్టి, ప్రతి పౌరుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని మంత్రి సురేఖ ధీమా వ్యక్తం చేశారు.

# అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది

మొదటిపేజీ తరువాయి



తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు.

రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం "కోల్డ్ స్టోరేజ్"లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# దీక్ష విరమణకు మూడు షరతులు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు.

**ప్రభుత్వం బాధ్యత వహించాలి**

తన మొదటి డిమాండ్‌గా విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలకు, ముఖ్యంగా ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనకు కేంద్ర ప్రభుత్వం రాజకీయ, పరిపాలనా బాధ్యత వహించాలని వాంగ్‌చుక్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

**పార్లమెంట్‌లో చర్చకు హామీ ఇవ్వాలి**

రెండో డిమాండ్‌గా నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి సమగ్ర చర్చకు తీసుకెళ్తామని అన్ని రాజకీయ పార్టీలు హామీ ఇవ్వాలని కోరారు. ఈ అంశాన్ని కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, విద్యా వ్యవస్థలో సంస్కరణల దిశగా చర్చ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఆసుపత్రికే వచ్చి హామీ ఇవ్వాలి**

తన ఆరోగ్య పరిస్థితి కారణంగా పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడితే, దేశంలోని అగ్ర రాజకీయ నాయకులు స్వయంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి వచ్చి పై రెండు డిమాండ్లపై తనకు వ్యక్తిగతంగా హామీ ఇవ్వాలని మూడో షరతుగా పేర్కొన్నారు. ఈ మూడు హామీలు లభిస్తే వెంటనే నిరాహార దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు.

**పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయాలని పిలుపు**

తన ఆరోగ్యం సహకరించకపోయినా ప్రజలు, విద్యార్థులు, సామాజిక సంస్థలు పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యల పరిష్కారం కోసం శాంతియుత ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు.

**ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపుపై హైకోర్టు నిరాకరణ**

ఇదిలా ఉండగా, వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ అభ్యర్థనపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి న్యాయస్థానం నిరాకరించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, స్వచ్ఛందంగా ఆసుపత్రిలో చేరేందుకు నిరాకరించిన నేపథ్యంలో అవసరమైతే బలవంతంగా ఆసుపత్రికి తరలించే అధికారం ప్రభుత్వానికి ఉందని కోర్టు వ్యాఖ్యానించింది.

**వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స**

వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆయన సమ్మతితోనే అవసరమైన మందులు అందిస్తున్నారని కోర్టు వెల్లడించింది. ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అవసరమైన వైద్య సేవలు కొనసాగుతున్నాయని న్యాయమూర్తి స్పష్టం చేశారు.




# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్.. కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

మొదటిపేజీ తరువాయి

ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.

సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు.

అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

# క్యూర్ పరిధిలో లక్ష గృహాల విప్లవం

**మొదటిపేజీ తరువాయి**

ఆగస్టు 10వ తేదీ వరకు అర్హులైన పేదల నుంచి అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజలు మీసేవ కేంద్రాలు, అధికారిక వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ ద్వారా సులభంగా అప్లై చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక వాట్సాప్ నెంబర్ (8096958096) ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఆ నియోజకవర్గ పరిధిలోనే దరఖాస్తు చేసుకోవాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షల లోపు ఉండాలని కండిషన్ పెట్టారు.

ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు లభించే భూమి విలువ మార్కెట్లో రూ. 40 లక్షల నుండి రూ. 60 లక్షల వరకు ఉంటుందని మంత్రి వివరించారు. ఇంతటి భారీ విలువైన ప్రభుత్వ స్థలాలను లబ్ధిదారులైన ఆడపడుచుల పేరిట ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని ప్రకటించారు. అయితే, ఈ ఇళ్లను కమర్షియల్ కాకుండా చూసేందుకు పదేళ్ల వరకు ఎవరికీ అమ్ముకునే అవకాశం ఉండదని, కానీ ఆర్థిక అవసరాల కోసం బ్యాంకుల్లో రుణం (లోన్) పొందేందుకు మాత్రం ఈ పత్రాలను తణఖా పెట్టుకునే వెసులుబాటు కల్పించామన్నారు.క్యూర్ పరిధిలో నిర్మించే ప్రతి ఇందిరమ్మ ఫ్లాట్ నిర్మాణానికి సుమారు 11 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతోందని మంత్రి తెలిపారు. ఇందులో రూ. 5 లక్షల రూపాయలను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా సబ్సిడీ రూపంలో భరిస్తుందని చెప్పారు. మిగిలిన 6 లక్షల రూపాయలను లబ్ధిదారుని వాటాగా నిర్ణయించామని, పేదలకు భారం కాకుండా ఈ మొత్తాన్ని నాలుగు సులభ వాయిదాలలో (ఇన్‌స్టాల్‌మెంట్స్) చెల్లించే సౌకర్యం కల్పించామన్నారు. దరఖాస్తు సమయంలో కట్టే రూ. 10 వేలను ఒకవేళ ఇల్లు రాకపోతే తిరిగి ఇచ్చేస్తామని, ఇల్లు వస్తే ఆ 6 లక్షల్లో మినహాయిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చట్టప్రకారం రిజర్వేషన్లు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో సొంత స్థలం గానీ, ఇల్లు గానీ లేని వారిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులను 360 డిగ్రీల పరిధిలో అత్యంత పారదర్శకంగా వడపోత (స్క్రీనింగ్) చేస్తామని, ఒకవేళ కోటా కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఎవరికీ అనుమానం లేకుండా అందరి ముందూ బహిరంగంగా లాటరీ తీసి ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

సచివాలయంలో జరిగిన ఈ ఘనమైన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇందిరమ్మ ఇళ్ల అధికారిక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఇన్‌స్టాగ్రామ్' ద్వారా అత్యంత సహేతుకంగా, వినూత్నంగా వివరించిన నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందిన కొండా నాగరాజు అనే యువకుడిని



మంత్రులు ప్రత్యేకంగా సత్కరించి, రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు.

గత ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత విధానాల వల్ల హైదరాబాద్ నగరానికి 30 నుండి 35 కిలోమీటర్ల దూరంలో ఇళ్లను నిర్మించారని, ఫలితంగా ఉపాధి దొరక్క కేవలం 89 వేల మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని మంత్రి విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం పేదల జీవనోపాధికి, పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, వారు నివసిస్తున్న ప్రాంతాల చెంతనే ఇళ్లను నిర్మిస్తోందన్నారు. ప్రతిపాదిత 525 చదరపు అడుగుల వైశాల్యంలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో ఈ ఫ్లాట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో రాజేంద్రనగర్(మైలార్‌దేవ్‌పల్లి), మహేశ్వరం(జల్పల్లి), శేరిలింగంపల్లి(రాయదుర్గం), మల్కాజిగిరి(కౌకూర్), నాంపల్లి(రెడ్‌హిల్స్), ఖైరతాబాద్(హకీంపేట్ దర్గా) వంటి 16 కీలక ప్రాంతాలను ఎంపిక చేశామని, త్వరలోనే మరో 8 నియోజకవర్గాల్లో స్థలాలు గుర్తిస్తామన్నారు.

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం జరుగుతున్న బోనాల జాతర శుభ సందర్భంగా ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాది క్యూర్ పరిధిలో నిర్మించే ఈ కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే పేద ఆడపడుచులతో బోనాలు ఎత్తించేలా పనులను శరవేగంగా పూర్తి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం నుంచి వెనక్కి తగ్గడం లేదని, ఇళ్ల నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. కేవలం పేదలే కాకుండా, సొంత ఇల్లు లేని మధ్యతరగతి ప్రజల గురించి కూడా ఆలోచిస్తున్నామని, త్వరలోనే వారికి కూడా గృహనిర్మాణ రంగంలో ఒక అద్భుతమైన శుభవార్త అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **ఎన్యుమరేషన్ ఫామ్ ను తప్పనిసరిగా సమర్పించాలి..**
- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణు గోపాల్**

**శంషాబాద్ జూలై20 (ప్రజాక్షేత్రం):**

ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు కాపాడుకోవాలని ఎన్యుమరేషన్ ఫారమ్‌లను (బిఎల్ఓ) అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి (బిఎల్ఓ) అధికారులకు సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడానికి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు:సర్పంచ్ సంపూర్ణ రాములు**
- **మోత్కుపల్లిలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన**

**మొయినాబాద్,జులై 20 (ప్రజాక్షేత్రం)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తోందని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పెద్దింటి బాలయ్యయాదమ్మల నూతన గృహ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి, ముగ్గు పోసి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ,ఎన్నికల హామీ మేరకు లబ్ధిదారులకు విడతలవారీగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్య,వార్డు సభ్యులు,గ్రామ పాలకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.



## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు రాజకీయ జోక్యానికి తవివ్వద్దు

- **జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వినతి**

**కరీంనగర్,జూలై 20 (ప్రజాక్షేత్రం):**

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించి, అర్హులైన నిరుపేదలకే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాను కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గృహ నిర్మాణ పథకం పేదల సొంతింటి కలను సాకారం చేసే కీలక సంక్షేమ కార్యక్రమమని అన్నారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో రాజకీయ ఒత్తిళ్లు, జోక్యాలకు తావివ్వకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని కోరారు.

ఆరెపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు, వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని, ఇళ్ల కేటాయింపులో వివక్ష లేకుండా పేదరికాన్నే ప్రాతిపదికగా తీసుకుని జాబితా రూపొందించాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా ప్రకటిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## అల్లరిమూకలపై పోలీసుల ఉక్కుపాదం

- **ఎనిమిది మందిపై కేసులు**

**కరీంనగర్, జూలై 20(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నగునూరు, జూబ్లీనగర్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎనిమిది మందిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై రెండు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

**ఆరు నెలల సత్ప్రవర్తన బాండ్లు**

నిందితులను కరీంనగర్ రూరల్ తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఆరు నెలల పాటు సత్ప్రవర్తనతో ఉండేలా బాండ్లు అమలు చేయించారు. అనంతరం నోటీసులు జారీ చేసి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలిగించే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సమాచారం అందించండి సీఐ నిరంజన్ రెడ్డి**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలు, మద్యం లేదా మత్తు పదార్థాల ప్రభావంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



## యాదిరెడ్డి త్యాగం మరువలేనిది

- **పెద్ద మంగళారంలో శ్రద్ధాంజలి ఘటించిన సీఓబీ చైర్మన్ మందడి చంద్రారెడ్డి,జగన్మోహన్ రెడ్డి**

**మొయినాబాద్,జులై 20 (ప్రజాక్షేత్రం):**

ఢిల్లీ పార్లమెంట్ ఆవరణలోనే తన ప్రాణాలను త్యాగం చేసిన అమరుడు యాదిరెడ్డి బలిదానం మరువలేనిదని నాయకులు కొనియాడారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం గ్రామంలో తెలంగాణ అమరుడు యాదిరెడ్డికి నాయకులు ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం యాదిరెడ్డి చేసిన అత్యున్నత త్యాగం తెలంగాణ ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని పేర్కొన్నారు. అమరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి,తిరుపతిరెడ్డి, రంగారెడ్డి,పాపిరెడ్డి,చేగురి ముత్యాలు,చేగురి రామకృష్ణ గౌడ్,ఉపేందర్ రెడ్డి,ఓం రెడ్డి, తాండ్ర కృష్ణ,లక్ష్మీనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు రజత పతకాలు సాధించిన రిటైర్డ్ ఎస్.బి.ఐ. అధికారి డి.వి. శంకరరావు.

**భద్రాచలం,జూలై20(ప్రజాక్షేత్రం):**

వయస్సు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ, జాతీయ స్థాయిలో మరోసారి అద్భుత విజయాన్ని అందుకున్నారు. వరుసగా మూడవ సారి జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న ఆయన, ఈసారి దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించారు.

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్) గార్ఖేడా స్టేడియంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'నేషనల్ మాస్టర్స్ క్లాసిక్ & ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2026'లో ఆయన పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. జూలై 20, 2026న జరిగిన ఈ పోటీలలో వివిధ విభాగాలలో 3 వ్యక్తిగత రజత పతకాలు , అలాగే ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుని మొత్తం నాలుగు రజత పతకాలతో భద్రాచలం కీర్తిని జాతీయ స్థాయిలో చాటారు. గతంలో కేరళలోని కోజికోడ్, హర్యానాలోని ఫరీదాబాద్‌లలో జరిగిన జాతీయ పోటీలలో పతకాలు సాధించిన ఆయన, ఇప్పుడు ఔరంగాబాద్‌లో కూడా తన విజయ పరంపరను కొనసాగించారు.

భద్రాచలంలోని 'సిటీస్టైల్ జిమ్' లో ప్రముఖ కోచ్ జి.వి. రామిరెడ్డి పర్యవేక్షణలో 73 ఏళ్ల శంకరరావు కఠినమైన శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కోచ్ రామిరెడ్డి మాట్లాడుతూ.. శంకరరావు క్రమశిక్షణ, పట్టుదల, శ్రమ అందరికీ ఆదర్శనీయమని, జాతీయ స్థాయిలో నాలుగు రజత పతకాలు సాధించడం ఆయన నిరంతర కృషికి నిదర్శనమని కొనియాడారు.

తన ఈ విజయానికి కారణమైన కోచ్ జి.వి. రామిరెడ్డి , తన కుటుంబ సభ్యులకు మరియు మద్దతుదారులందరికీ శంకరరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతర్జాతీయ వేదికలపై దేశానికి మరిన్ని పతకాలు తీసుకురావడమే తన తదుపరి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ గెలుపొందిన విజేతను పట్టణ ప్రముఖులు పలువురు రాజకీయ నాయకులు, పలు క్రీడా సంఘాల నాయకులు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి మల్లేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రీన్ భద్రాద్రి సభ్యులు సిటీ స్టైల్ జిమ్ సభ్యులు తదితరులు అభినందించడం జరిగింది.




## శంకర్‌పల్లిలో ఘనంగా పూరీ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం

**శంకర్‌పల్లి జులై 20(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి పట్టణంలో పూరీ శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. హరేకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో హరినామ సంకీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. గీతా మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్ర శంకర్‌పల్లి ప్రధాన వీధుల గుండా వైభవంగా కొనసాగింది. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను అలంకరించిన రథంపై ఊరేగించగా భక్తులు పూలు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ప్రధాన వీధులన్నీ సందర్శించిన అనంతరం రథయాత్ర తిరిగి గీతా మందిరానికి చేరుకుని ముగిసింది. కార్యక్రమంలో హరేకృష్ణ మిషన్ ప్రతినిధులు,




స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ ఇసుక రవాణా..!

- పోతంగల్ మండల మంజీరా పరివాహక ప్రాంతం నుండి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- రాత్రుల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక తరలింపు
- అరకొరా దాడులతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- ఆదివారం రాత్రి రెండు అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

**బాన్సువాడ,జులై20(ప్రజాక్షేత్రం):**

కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండల మంజీరా పరివాహక గ్రామాల నుండి అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. రాత్రుల్లో యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ అక్రమార్కులు జోరుగా డబ్బులు దండుకుంటున్నారు. తమకు అడ్డు అదుపు లేదని చెబుతూ రాత్రి 8 గంటల నుండే అక్రమ ఇసుక రవాణా కొనసాగిస్తున్నారంటే అక్రమార్కుల ఆగడాలు ఎంతలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మంజీరా నది నుండి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలింపు జరుగుతుందని అధికారులు మాత్రం అటువైపు చూడడం లేదని స్థానికులు అంటున్నారు. అరకొరా దాడులతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు అడుగులు వేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఆదివారం రాత్రి పోతంగల్ మండల కేంద్రంలోని మంజీర పరివాహక ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల సమాచారాన్ని కొందరు అందజేయడంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**పోతంగల్, కొడిచర్ల, హంగర్గా, కారేగాం ,సుంకుని గ్రామాల నుండి.**

పోతంగల్ మండలం లో ప్రధాన ఇసుక వనరైన మంజీరా నది నుండి ప్రతిరోజు అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుందని స్థానికులు చెబుతున్నారు. మంజీరా నది ఇసుక పాయింట్లు ఉన్న పోతంగల్, కొడిచెర్ల, హంగర్గా, కారేగాం, సుంకిని గ్రామాల నుండి ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో రాత్రి వేళల్లో జోరుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. మండల రెవెన్యూ అధికారి, సిబ్బంది ఎస్ఐఆర్ ప్రక్రియలో బిజీ ఉండగా ఇదే అదునుగా భావిస్తున్న ఇసుక అక్రమార్కులు రెచ్చిపోయి రాత్రి వేళల్లో అడ్డూ అధుపు లేకపోవడంతో జోరుగా ఇసుక రవాణా కొనసాగిస్తున్నారు. గతంలో అధికారులకు భయపడి అర్ధరాత్రి సమయంలో అక్రమ వ్యాపారాలు కొనసాగేవి. కానీ ప్రస్తుతం రాత్రి 8 తర్వాత పోతంగల్ మంజీరా నది నుండి పరివాహ ప్రాంతా గ్రామాల నుండి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాత్రుల్లో పోలీసుల పెట్రోలింగ్ వాహనం తిరుగుతున్నప్పటికీ అక్రమ ఇసుక రవాణా జరగడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు, ఇతర అభివృద్ధి పనులకు వారంలో రెండు మూడు రోజులు ఇసుక తరలించేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నప్పటికీ ధనార్జనే ధ్యేయంగా ఉన్న అక్రమ ఇసుకాసురులు రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణాకు తెర లేపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి మంజీరా నది నుండి అక్రమ ఇసుక రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## వార్డుల అభివృద్ధిలో రాజీ లేదు

- మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్.
- 16వ వార్డులో ఘనంగా సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**మొయినాబాద్,జులై 20 (ప్రజాక్షేత్రం):**

మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్పర్సన్ దుబ్బా సోనియా దర్శన్ స్పష్టం చేశారు. 16వ వార్డులోని గవర్నమెంట్ హాస్పిటల్ నుండి అమీర్గూడ వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ జంగం గీతా వనజాక్షి సంజీవరావుతో కలిసి ఆమె శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు మరియు వీధిదీపాల సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ,నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.





## అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో గంగపుత్ర సంఘం భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**నిజామాబాద్ జులై 20 (ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం నందు శివాలయం వెళ్లే మార్గంలో ఉన్న గంగాపుత్ర సంఘం భవనంలో అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మేఘ వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు సిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పి షేక్ షావలి డాక్టర్ ఎం వి ఎస్ సుధాకర్ డాక్టర్ అస్మా షేక్ పాల్గొని ప్రజల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు రోగుల ఆరోగ్య పరిస్థులను పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు చికిత్స సలహాలు అందించారు ఈ కార్యక్రమానికి 29వ వార్డు కౌన్సిలర్ రాజుల దేవి లక్ష్మి పూజిత పవన్ కుమార్ అసెంబ్లీ ఇంచార్జ్ వడ్డీ మోహన్ రెడ్డి సీనియర్ నాయకులు అడ్లూరు శ్రీనివాస్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కూరేళ్ల శ్రీధర్ బోధన్ పట్టణ అధ్యక్షుడు పసులాంటి గోపి కిషన్ మాజీ పట్టణ అధ్యక్షుడు గోలిపాక బాలరాజు పట్టణ ప్రధాన కార్యదర్శి మిర్జాపూర్ అరవింద్ బీజేవై ఎం పట్టణ అధ్యక్షుడు ఏనుగొట్టి గౌతం గౌడ్ తో పాటు పెరిక వెంకటేష్ వినయ్ రాజు శ్రీను ప్రకాష్ కళ్యాణ్ రాకేష్ పాల్గొన్నారు.





## పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ జువ్వి నర్సింహ్మకు ఘన సన్మానం

**చౌటుప్పల్ జూలై 20(ప్రజా-క్షేత్రం):**



చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మను గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పాల ఉత్పత్తిదారుల సంఘం తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ గా సేవలు అందించిన జువ్వి నర్సింహ్మ సర్పంచ్ గా గెలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గా రెండోసారి ఎన్నికైన రాచకొండ కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు సామిడి అంజిరెడ్డి, సామిడి లింగారెడ్డి, ఊదరి ఎల్లయ్య, కొంతం సుశీలఎల్లారెడ్డి, జంగం అంజయ్య, బద్రి బుచ్చయ్య, జక్కలి మల్లయ్య, కార్యదర్శి చెరుకు మహేందర్ గౌడ్, రాచకొండ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## "స్నేహ బంధం అమరం... మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం!"

- అకాల మరణం చెందిన కరంచంద్ కుటుంబానికి రూ. 1.15 లక్షల ఆర్థిక సాయం
- అందించిన 2003-04 టెన్త్ బ్యాచ్ స్నేహితులు

**మొయినాబాద్, జులై 20(ప్రజాక్షేత్రం):**

అది కేవలం బడి బయట విడిపోయిన స్నేహం కాదు... కష్ట కాలంలో కొండంత అండగా నిలిచే నిజమైన ఆత్మీయ అనుబంధం అని నిరూపించారు ఆ స్నేహితులు. ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కరంచంద్ అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి, తీవ్ర ఆవేదనకు గురైంది. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కష్టకాలంలో తమ వంతు బాధ్యతగా బాసటగా నిలవాలని నిర్ణయించుకున్న 200304 టెన్త్ బ్యాచ్ మిత్రులంతా కలిసి రూ.1,15,000 (లక్షా పదిహేను వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఆ మొత్తాన్ని కరంచంద్ కుటుంబ సభ్యులకు నేరుగా అందజేసి అండగా ఉంటామని ధైర్యాన్ని చెప్పారు. ఏళ్లు గడిచినా, ఎంతటి కష్టం వచ్చినా తమ స్నేహ బంధం చెక్కుచెదరదని రుజువు చేసిన పూర్వ విద్యార్థుల మానవత్వాన్ని, ఐక్యతను పలువురు స్థానికులు విశేషంగా కొనియాడారు. తోటి మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన స్నేహితుల అభినందనీయమైన చొరవను గ్రామీణులు అభినందించారు.



## ప్రమాదకరంగా ఉన్న ధర్మారెడ్డిపల్లి కాలువ కల్వర్టుపై సైడ్ గోడలు నిర్మించాలి:సిపిఎం

- జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య
- మండల కార్యదర్శి సిర్పంగి స్వామి

**వలిగొండ జులై 20(ప్రజాక్షేత్రం):**

వలిగొండ-చౌటుప్పల్ ప్రధాన రహదారి సమీపంలోని జాలు కాలువ వద్ద గోకారం వెల్లంకి మార్గంలోని ధర్మారెడ్డిపల్లి కాలువ కల్వర్టు ప్రమాదకరంగా మారిందని, వెంటనే ఇరువైపులా సైడ్ గోడలు నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి . స్వామి డిమాండ్ చేశారు సోమవారం కల్వర్టును పరిశీలించిన వారు మాట్లాడుతూ కాలువ మరమ్మత్తుల సమయంలో కాంట్రాక్టర్ సైడ్ గోడలు నిర్మించకపోవడంతో పోసిన మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. మూలమలుపు కావడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు ఇరిగేషన్ శాఖ అధికారులు పనులను సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో నాసిరకం పనులు జరిగాయని ఆరోపించారు. ప్రాణనష్టం సంభవించేలోపే అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని, నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిర్పంగి శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్, మద్దెల మారయ్య,రాపోతు వెంకులు,ఇంద్రారెడ్డి ,చేగూరి నగేష్,గంగాపురం వెంకటేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## న్యాలట గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**చేవెళ్ల, జూలై 20(ప్రజాక్షేత్రం):**

న్యాలట గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం ఘనంగా ఏర్పాటు చేశారు. గ్రామంలోని అంబేద్కర్ వాదులు, యువకులు, గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ సభ్యుల వివరాలు:**

అధ్యక్షుడు: పామెన ఆకాష్ (సన్నీ)
ఉపాధ్యక్షుడు: గోపనీ సందీప్
సెక్రటరీ: పెద్దనోళ్ల శ్రీనివాస్
జాయింట్ సెక్రటరీ: తొంటోల్ల యాదయ్య
కోశాధికారి: ఆలూరి సునీల్ కుమార్

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పామెన ఆకాష్ (సన్నీ) మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన గ్రామ పెద్దలు, మిత్రులు, అంబేద్కర్ వాదులు, యువతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గ్రామంలో మరింత బలోపేతం చేస్తూ, యువతను ఐక్యం చేసి సామాజిక అభివృద్ధి, విద్యా చైతన్యం, సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అంబేద్కర్ యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసి గ్రామాభివృద్ధి, సామాజిక న్యాయం, యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంబేద్కర్ వాదులు, యువజన సంఘ సభ్యులు మరియు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## అమ్మాయిల చదువు సమాజానికి వెలుగు గుండంపల్లిలో అవగాహన సదస్సు

**నిర్మల్ జిల్లా జూలై 20(ప్రజాక్షేత్రం):**

గుండంపల్లి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో బాలికల సంరక్షణ, వారి విద్యాభివృద్ధి లక్ష్యంగా సాగిన ఈ సదస్సులో నిపుణులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నేటి సమాజంలో అమ్మాయిల విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, ఒక బాలికను చదివిస్తే ఆ కుటుంబమంతా విద్యావంతమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఇంకా వేరూనుకుని ఉన్న లింగ వివక్షను రూపుమాపాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మైనర్ బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ చట్టాలు, రక్షణ కల్పించే ప్రత్యేక హెల్ప్లైన్ నంబర్ల గురించి విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా చిన్ననాటి నుంచే ఆత్మరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ (మంచి స్పర్శ చెడు స్పర్శ) ల మధ్య గల వ్యత్యాసాన్ని వివరించారు. కౌమార దశలో ఎదురయ్యే శారీరక మార్పులు, రుతుక్రమ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు అధైర్యపడకుండా తక్షణమే ఉపాధ్యాయులకు గానీ, అధికారులకు గానీ సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) మధు సిలారి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

**చౌటుప్పల్ జూలై 20(ప్రజాక్షేత్రం):**

తూప్రాన్ పేట్ గ్రామం నుండి లబ్ధిదారులు బక్కతట్ల జంగయ్య కు 85,000 ఏనాబాయి ఐదు వేల రూపాయలు మరియు ఏనుగుల లక్సమ్మ 15,000 పదిహేను రూపాయలు మంటిపల్లి చెన్నయ్య 40,000 నలభై వేల రూపాయలు ఈ కుటుంబలకు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయానిది నుండి చెక్కును చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఏఎంసి వైస్ చైర్మన్ అక్కుల ఇంద్ర సేన రెడ్డి, మాజీ ఎంపీపీ వెలిగే రాజశేఖర్ రెడ్డి ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, డీసీసీ సెక్రటరీ అర్ద వెంకట్ రెడ్డి, తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచల శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల నరేందర్ రెడ్డి, గంధం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# సంస్థాన్ నారాయణపూర్ మండల ఉపసర్పంచ్ ల ఫోరం కమిటీ నియామకం

- **ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడుగా బండమీది కిరణ్**
- **ప్రధాన కార్యదర్శిగా సభావత్ రాజేందర్ నాయక్**

**సంస్థాన్ నారాయణపురం, జులై 20(ప్రజాక్షేత్రం):**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉప సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డా "సుర్కంటి శ్రీధర్ రెడ్డి గారు, జిల్లా కార్యదర్శి బోదాసు స్వాతి వెంకటేష్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ల ఫోరం మండల కమిటీ నియమించడం జరిగింది. మండల అధ్యక్షుడిగా బండమీది కిరణ్, ప్రధాన కార్యదర్శిగా సభావత్ రాజేందర్ నాయక్, ఉపాధ్యక్షులుగా కరంటోతు శ్రీను, వాంకుడోత్ రాజు, ఎర్ర సుశీల, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మెరుగు సైదులు, కరెంటోతు రాజు, కార్యదర్శిగా కరెంటూత్ సుజాత, మల్లెపల్లి నిర్మల, వాంకుడోత్ నాకి, అధికార ప్రతినిధిగా కేతావత్ గోవర్ధన్, సహాయ కార్యదర్శిగా రావుల ప్రశాంత్, కోర్ర కవితా దశరథ, కేలోతు కృష్ణప్రియ రమేష్, గౌరవ సలహాదారులుగా పల్లె మల్లారెడ్డి, కోర్ర రాజు, లింగంపల్లి పుష్పలత నియామకం కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉప సర్పంచులు ఎలిజాల శ్రీను పోట్ట నరసింహ, కట్కూరి భాస్కర్, ముక్కెర్ల కవితా స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ జన్మదిన వేడుకలు

- **రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కర్నే ప్రభాకర్ అభిమానులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు**

**సంస్థాన్ నారాయణపురం, జులై 20(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ కర్నే ప్రభాకర్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాచకొండ రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కర్నె ప్రభాకర్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాశం కృష్ణ, గుండమల్ల సతీష్ కుమార్, రాసాల వెంకటేష్ ,ఏర్పుల అంజమ్మ, శికిలమెట్ల ప్రభాకర్,డాక్టర్ లింగస్వామి,చిలువేరు వెంకులు,సోమనబోయిన కృష్ణకుమార్, చిలువేరు సైదులు, పానుగోతు పాండు రంగనాయక్, జనగాం నర్సింహ్మా, పానుగోతు తరుణ్ నాయక్, చిలువేరు వెంకటేష్, గొల్లురి శ్రీశైలం, కొల్లురి నవీన్, చిలకం శివ, మందుగుల సాయి, జనగాం రాజు పాల్గొన్నారు.



# పారిశుద్ధ కార్మికుల సంక్షేమంపై డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**కీసర, జూలై 20(ప్రజా క్షేత్రం):**

కీసర సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ కార్మికులకు PF, ESI పథకాలపై ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించడంతో పాటు వారానికి ఒక రోజు విశ్రాంతి దినం కల్పించాలని సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. అంకిరెడ్డి పల్లి, కీసర, యాద్గారిపల్లి, చీర్యాల, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో పనిచేస్తున్న 90 మందికి పైగా కార్మికులకు PF, ESI ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే గ్లౌజులు, మాస్కులు, గమ్ బూట్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు వంటి రక్షణ పరికరాలు అందించి, వాటి వినియోగంపై శిక్షణ ఇవ్వాలని కోరారు.



కార్మికుల సంక్షేమానికి సంబంధించిన వినతులను సానుకూలంగా పరిశీలించి అమలు చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

# అందోలు నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ

- **9 మండలాల్లో 134.20 కి.మీ రోడ్ల విస్తరణకు రూ.338.63 కోట్లు మంజూరు**

**అందోల్ , జూలై 20(ప్రజాక్షేత్రం):**

అందోలు నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారుల స్వరూపం మారిపోనుంది. 134.20 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులు, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 338.63 కోట్ల నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలో ఎనిమిది కీలకమైన రోడ్లను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. ఈ విధానంలో ప్రభుత్వం 40 శాతం నిధులను ఇస్తుంది. మిగిలిన 60 శాతం కాంట్రాక్టరే సమ కూర్చుకోవాలి. పనులు పూర్తయిన తర్వాత నిర్ణీత కాలంలో వార్షిక వాయిదాల రూపంలో మిగిలిన నిధులను చెల్లిస్తుంది. అల్లాదుర్గంమెటల్ కుంట రోడ్డు రూ. 217.96 కోట్లతో అభివృద్ధి విడుదలైన నిధుల్లో అల్లాదుర్గంమెటల్ కుంట వరకు 30 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 217.96 కోట్లు కేటాయించారు. అలాగే, 161ఏ జాతీయ రహదారిపై ఉన్న తాడ్దాన్పల్లి చౌరస్తా నుంచి సింగూరు ప్రాజెక్ట్ వరకు 25.80 కిలోమీటర్ల రోడ్డుకు 5. 29.88 కంకోల్‌రాయికోడ్ 5 28.50 8.5 రోడ్డుకు రూ.33 కోట్లు, జోగిపేటవట్ పల్లి 23 కి.మీ రోడ్డుకు 26.64 కోట్లను కేటా యించారు. ఇవేకాకుండా, బుదేరామర్పల్లి, రేగోడ్‌రాయిపల్లి, జోగిపేటచింతకుంట, తదితర గ్రామీణ ప్రాంతాల రోడ్ల విస్తరణ, పున రుద్దరణ చేపట్టనున్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించను న్నారు. మంత్రి దామోదర్ రాజ నర్సింహ చొరవతో నిధులు విడుదల కావడంతో గతుకుల రోడ్లతో దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కానుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు.అందోల్ నియోజకవర్గంలోని రహదారులకు మహర్దశ పట్టింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 9 మండలాల్లో 134.20 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.338.63 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.






గత పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా అధ్వానంగా మారిన గ్రామీణ రహదారులన్నీ ఈ ప్యాకేజీతో రూపురేఖలు మారనున్నాయి. నియోజకవర్గంలోని అందోల్, పుల్కల్, మునిపల్లి, అల్లాదుర్గ్, టేక్మాల్, పాపన్నపేట, పెద్ద శంకరంపేట, రాయికోడ్ మండలాల్లోని ప్రధాన రహదారులు, లింక్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించి, బీటీ రోడ్లుగా తీర్చిదిద్దనున్నారు. అంతేకాకుండా పలుచోట్ల హైలెవల్ వంతెనల నిర్మాణం కూడా చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే అందోల్ మండలం సంగుపేట నుంచి పుల్కల్ మండలం పోచారం వరకు 18 కి.మీ రోడ్డుకు రూ.40 కోట్లు, మునిపల్లి మండలం క్యాసారం నుంచి గార్లపల్లి, అల్లాపూర్ వరకు 10 కి.మీ రోడ్డుకు రూ.30 కోట్లు, నార్సింగ్ నుంచి పెద్ద శంకరంపేట వరకు వంతెన నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు కాగా, తాజాగా మొత్తం నియోజకవర్గానికి రూ.338.63 కోట్ల భారీ ప్యాకేజీ మంజూరైంది. ఈ నిధులతో చేపట్టే పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించేందుకు ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధితో రైతులు, వాహనదారులకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నియోజకవర్గానికి భారీ నిధులు మంజూరవడంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డిండి ఎత్తిపోతల పథకానికి గండి కొడుతున్న తెలంగాణ ప్రభుత్వం

- **చేతులు ముడుచుకున్న జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**
- **బీజేపీ రాష్ట్ర నాయకులు దోనూరు వీరారెడ్డి, జక్కలి రాజు యాదవ్**

**సంస్థాన్ నారాయణపురం, జులై 20(ప్రజాక్షేత్రం):**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు.ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఆ జిల్లా ఎమ్మెల్యేలు ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు ముఖ్యంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల రైతాంగానికి ప్రాణాధారమైన డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారని తెలిపారు. అయితే, నల్గొండ జిల్లా మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం విచారకరమని అన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. మునుగోడు ప్రజలకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు విషయంలో స్థానిక ఎమ్మెల్యే మౌనం వహించడం ప్రజల ప్రయోజనాలను విస్మరించినట్టేనని విమర్శించారు. మునుగోడు, దేవరకొండ ప్రాంతాల రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా డిండి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టే కుట్ర జరుగుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ కుట్రను నల్గొండ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంటనే అడ్డుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి డిండి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి అక్కడి నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించేలా చర్యలు తీసుకుని మునుగోడు ప్రాంత రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం ప్రభుత్వ తక్షణ బాధ్యత అని పేర్కొన్నారు. లేనిపక్షంలో రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి, జిల్లా నాయకులు వంగరి రఘు, చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్, ఉపసర్పంచులు బండమీది కిరణ్, వెలిజాల శ్రీను, మెరుగు సైదులు, కట్కూరి భాస్కర్ గౌడ్, మండల నాయకులు సుర్వి వెంకటేష్ గౌడ్, నర్రి నరసింహ, నెల్లికంటి శ్రీశైలం, ఉస్కాగుల గిరిబాబు గౌడ్, గొల్లూరి సాయి, వంగూరి కృష్ణ యాదవ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# నేషనల్ జాతీయ అవార్డు అందుకున్న మాజీ కౌన్సిలర్ బుడుముల యాదగిరి

**మహేశ్వరం జులై 20(ప్రజాక్షేత్రం):**

జల్ పల్లి 16 వార్డు మాజీ కౌన్సిలర్ బుడుమల యాదగిరి నేషనల్ జాతీయ అవార్డు అందుకున్న మాజీ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్ పల్లి మున్సిపాలిటీ. జల్ పల్లి గ్రామం 16 వార్డు కౌన్సిలర్ గా గత మున్సిపల్ ఎలక్షన్ లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలవడం జరిగింది గెలిచిన ఐదు సంవత్సరాలలో ప్రజలకు తన సేవలు అందించి గుర్తింపు పొందడంతో ఆదివారం రోజున నాచారంలో బహుజన సాహిత్య అకాడమీ



ఆధ్వర్యంలో నేషనల్ జాతీయ బెస్ట్ కౌన్సిలర్ గా జాతీయ అవార్డు అందజేయడం జరిగింది




# ఊపిరాడని పని భారం పట్టించుకోని సర్కారు

**నిర్మల్ జిల్లా జూలై 20(ప్రజాక్షేత్రం):**

నిర్మల్ సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న మూడు నెలల రేషన్‌ను ఒకేసారి సరఫరా చేసే విధానం వల్ల హమాలీ కార్మికులపై తీవ్రమైన పనిభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు వందల క్వింటాళ్ల బియ్యం బస్తాలను లారీల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి వస్తుండటంతో కార్మికుల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. నిరంతరం బరువులు మోయడం వల్ల నడుము నొప్పులు, మోకాళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నామని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మూడు నెలల విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే నెల నెలా రేషన్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం వల్ల తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రతి నెల 10వ తేదీలోగా కార్మికులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కనీస వేతనాన్ని పెంచి అమలు చేయాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, విశ్రాంతి గదులు వంటి కనీస వసతులు కల్పించాలని కోరారు.

# కొడుకులే కడగండ్లు.. కలెక్టర్‌కు వృద్ధ దంపతుల మొర

- **భూమి తిరిగి ఇప్పించి.. పింఛన్ అందేలా చేయాలని కలెక్టర్‌కు వృద్ధ దంపతుల వినతి**

**కరీంనగర్, జూలై 20(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకలివానిపల్లెకు చెందిన బామండ్ల లక్ష్మీ నర్సవ్వ, నర్సయ్య దంపతులు తమ ఇద్దరు కుమారులు పోషణ, నివాసం కల్పించకుండా ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తమకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. తమకు ఉన్న 5.30 ఎకరాల భూమిలో ఇద్దరు కుమారులకు చెరో 2.20 ఎకరాల చొప్పున పంచి ఇచ్చామని, కుమార్తె వివాహ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తర్వాత 0.20 ఎకరాల భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామని పేర్కొన్నారు. భూములు పొందిన అనంతరం కుమారులు తమను ఇంట్లో ఉండనివ్వకుండా, తాము నిర్మించుకున్న ఇంటిని స్వాధీనం చేసుకుని బయటకు పంపించారని ఆరోపించారు. ప్రస్తుతం కుమార్తె ఇంట్లో ఆశ్రయం పొందుతున్నామని, ఆమెకు కూడా ఇద్దరు కుమార్తెలు ఉండటంతో అక్కడ ఎక్కువకాలం ఉండలేని పరిస్థితి నెలకొన్నట్లు వివరించారు. తమ భర్త పేరుపై ఉన్న భూమిని ఆధారంగా చేసుకుని కుమారులు క్రాప్ లోన్ తీసుకున్నారని, అయితే దాదాపు పదేళ్లుగా ఆ రుణాన్ని చెల్లించకపోవడంతో వికలాంగుల పింఛన్ మొత్తాన్ని బ్యాంకు రుణ బకాయిల కింద నిలిపివేస్తోందని తెలిపారు. దీంతో గత కొంత కాలంగా సుమారు రూ.3.50 లక్షల పింఛన్ బ్యాంకులోనే నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 11న చిన్న కుమారుడు అనిల్ తనపై దాడి చేసి తాటి మట్టతో కొట్టడంతో పాటు దుర్భాషలాడాడని ఆరోపించారు. ఈ ఘటనపై నాలుగు నెలల క్రితమే ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. తమ భూమిని తిరిగి ఇప్పించి, ఇంటిలో నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని, కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వికలాంగుల పింఛన్ తిరిగి అందేలా చూడాలని కలెక్టర్‌ను వృద్ధ దంపతులు కోరారు.



# అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..! అధికారుల మౌనం ఎందుకు?

- **భారీ నిర్మాణాలు.. చూసీచూడనట్టు అధికారులు!**

**సఫిల్ గూడ, జూలై 20(ప్రజా క్షేత్రం):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్‌గూడ-సాయినాథపురం ప్రధాన రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాలకు ఒక విధంగా అనుమతులు తీసుకుని, వాస్తవంగా మాత్రం అనుమతులకు భిన్నంగా అదనపు అంతస్తులు, విస్తీర్ణంతో నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఓల్డ్ సఫిల్‌గూడ-సాయినాథపురం రహదారి మల్కాజిగిరి ప్రాంతంలోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటి. ప్రతిరోజూ, ఆర్.టి.సి.బస్ లు, వందలాది కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, పాఠశాల బస్సులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రహదారి పక్కనే భారీ నిర్మాణాలు కొనసాగుతుండటంతో నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే నిల్వ చేయడం, సిమెంట్ మిక్సర్ వాహనాలు, లారీలు రాకపోకలు సాగించడం వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు ప్రారంభమైనప్పటి నుంచి స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆ తర్వాత నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న తర్వాత చర్యలు తీసుకుంటే వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ నిబంధనలు పాటిస్తున్నారా? నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత యజమానులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.







భవిష్యత్తులో ఈ భవనాలు వినియోగంలోకి వచ్చిన తర్వాత వాహనాల రద్దీ మరింత పెరిగి ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మల్లాపూర్ యూపీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

- **ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్యాధికారి సమీక్ష.. టీబీ, ఎన్‌సీడీ, ఎంసీహెచ్ సేవల అమలుపై ఆదేశాలు**

**మల్లాపూర్,జూలై 20(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సోమవారం మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, సేవల నాణ్యతను మెరుగుపర్చాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మాతా-శిశు ఆరోగ్య (ఎంసీహెచ్) కిట్ల పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఆయన, అర్హులైన ప్రతి గర్భిణి, బాలింతకు కిట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి, నమోదైన రోగులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందించే ఆర్థిక సహాయం ప్రక్రియను పరిశీలించారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి జాప్యం లేకుండా నమోదు చేసి, లబ్ధి సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమం పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా వైద్యాధికారి, స్క్రీనింగ్‌ను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వ్యాక్సిన్ల నిల్వ కోసం ఉపయోగించే ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్)ను తనిఖీ చేసి, ఉష్ణోగ్రత నిర్వహణ, కోల్డ్ చైన్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వ్యాక్సిన్ల నాణ్యతకు భంగం కలగకుండా అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.



## శిథిలావస్థలో ఇల్లు.. భయాందోళనలో కాలనీవాసులు

- **ఒకవైపు కూలిన ఇల్లు.. మరోవైపు నెర్రెలు**
- **ఇంటిలోపల దట్టంగా పెరిగిన చెట్లు,పొదలు**
- **పాములు,తేళ్లకు నిలయంగా మారిన శిథిల గృహం**
- **కాలనీవాసుల్లో భయాందోళన**
- **పెద్దేముల్ గ్రామంలో శిథిలమైన సుమారు 25 ఇండ్ల పై అధికారులు దృష్టి సారించాలి**
- **వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన.. వెంటనే చర్యలు తీసుకోవాలని పెద్దేముల్ గ్రామ ప్రజల విజ్ఞప్తి**

**పెద్దేముల్, జూలై 20 (ప్రజా క్షేత్రం )**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల కేంద్రంలో ఓ పురాతన ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి స్థానిక ప్రజలకు పెను ప్రమాదంగా మారింది.పెద్దేముల్ గ్రామంలో గాంధీ చౌక్ ప్రాంతంలో ఉన్న ఈ ఇల్లు ఒకవైపు పూర్తిగా కూలిపోగా, మరోవైపు గోడలు నెర్రెలు బారడంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో చుట్టుపక్కల నివాసితులు క్షణక్షణం ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.ఇంటి లోపల, చుట్టుపక్కల భారీగా చెట్లు, పొదలు పెరిగిపోవడంతో పాములు, తేళ్లు, ఇతర విషపూరిత క్రిమికీటకాలకు ఇది నిలయంగా మారింది.అక్కడి నుంచి తరచూ పాములు, తేళ్లు బయటకు వచ్చి సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో చిన్నారులు,వృద్ధులు, మహిళలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ శిథిల భవనం గురించి ఇప్పటికే మూడు నెలల క్రితమే కాలనీవాసులు పెద్దేముల్ గ్రామపంచాయతీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని కాలనీ వాసులు తెలిపారు.వర్షాల నేపథ్యంలో ఎప్పుడైనా మిగిలిన భాగం కూలిపోయి ప్రాణ,ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు వెంటనే ఈ శిథిల గృహాన్ని పరిశీలించి ప్రమాదకర భాగాలను తొలగించడం, చెట్లు, పొదలను శుభ్రం చేయించడం, అవసరమైతే భవనాన్ని పూర్తిగా తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు,స్థానికులు కోరుతున్నారు.అంతేకాకుండా పెద్దేముల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 25 వరకు శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయని, వర్షాకాలంలో అవి కూడా ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందని గ్రామ ప్రజలు చెబుతున్నారు. అందువల్ల జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించి ప్రమాదకర భవనాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు.





## ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం విజయవంతం

- **యువత గొంతుకకు కాంగ్రెస్ అండగా ఉంటుంది : బండి రమేష్**

**(ప్రజాక్షేత్రం) కూకట్ పల్లి**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాహుల్ గాంధీ గారి ఆదేశాల మేరకు భారత జాతీయ కాంగ్రెస్ మరియు భారత యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం యువత, విద్యార్థుల హోరెత్తించిన నినాదాల మధ్య అత్యంత విజయవంతంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ బండి రమేష్ గారు మాట్లాడుతూ, "ఇది యువ భారతం... యువత భవితనే దేశ భవిత" అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని, విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని ఆయన విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకులు, నిరుద్యోగం, ఉన్నత విద్యలో అవకాశాల కొరత వంటి సమస్యలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు.

ఈ పరిస్థితులపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, వారి హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, యువతీ యువకులు, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాకీర్, రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్, తూము వేణు, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, శ్రీనివాస్ బాబు, సాయిబాబా చౌదరి, రంగమోహన్, గంధం రాజు, రాజేష్, శంకర్, పులి శివ గౌడ్, రామారావు, సునీల్, శ్రీకాంత్ పటేల్, మైఖేల్, బాలరాజు, సంధ్య రాణి, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఉద్యమిస్తుందని, యువత ఆశయాల సాధనకు ప్రతి అడుగులోనూ అండగా నిలుస్తుందని నాయకులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



## ధర్మేంద్ర ప్రధాన్ 'రాజీనామా చేయాలి'

నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో 2026 జూన్ 21న ప్రారంభమై నేటికి 29వ రోజులుగా నిరసనలు, దీక్షలు కొనసాగుతున్ననూ వాటిని అణచివేయడం పైననే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించి 'ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరిద్దాం' అనే దిశగా ముందుకు సాగకపోవడం కడు విచారకరం. ఈ ఆందోళనలో భాగంగానే ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ ఇరవై ఒక్క రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షని కొనసాగిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిన తీరు 'సభ్యసమాజానికి సిగ్గుచేటు'గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులతో ఏకంగా దీక్షని భగ్నం చేయించడం అప్రజాస్వామిక పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది.

సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం అనంతరం శాంతియుతంగా దీక్షను కొనసాగిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై ఒక మహిళ ఏకంగా సిరా దాడికి పాల్పడడం అనైతికం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఏమాత్రం భావ్యం కావు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. దీక్షని కొనసాగిస్తున్న పౌరుల ప్రాణాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం అణువంత ఆందోళన చెందకపోవడం కడు గర్హనీయం. ఆందోళనకారుల భద్రతపై కేంద్రమే బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేరుకే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా వర్ధిల్లుతున్న ఈ భారతదేశంలో పాలకులు అప్రజాస్వామికంగా వ్యవహరించడం ఏరకంగాను సహేతుకం కాదు. నిజానికి ప్రజాస్వామికంగా పాలించలేని పాలకులు పౌరులు నినదించక ముందే సిగ్గుతో తలదించుకొని స్వచ్ఛందంగా దిగిపోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. కాని పౌరులు రాజీనామా అని నినదిస్తున్న కూడా పాలకులు తమ పదవులకు అట్లే అంటిపెట్టుకొని ఉండడం తద్వారా వారికి 'పదవులపై ఉన్న ఆశను చూపిస్తుందే తప్ప ప్రజలకు సేవ చేద్దాం' అనే ఆశయాలకు తిలోదకాలు ఇవ్వడాన్ని సునిశితంగా గమనించవచ్చు. నోట్లు పోగేసి, ఓట్లు కూడగట్టి, సీట్లు పొంది పాలకులుగా వచ్చినవారు 'ప్రజాసేవను విస్మరిస్తూ పౌరుల సమస్యలను అసలుకే పట్టించుకోవడం లేదు' అనే దానికి 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అనే ఈ ఆందోళన నిదర్శనంగా నిలుస్తుంది. నిజానికి నీట్ పేపర్ లీక్ అయినప్పుడే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఉండాల్సింది. ఇకనైననూ ఆందోళనలు మరింతగా ఉధృతం కాకముందే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. మంత్రి రాజీనామా చేసేంతవరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

**-జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్: 94933 19690**



## రోడ్డు గుంతల్లో వరి నాట్లు వేసి బీఆర్ఎస్ వినూత్న నిరసన!

**మేడ్చల్ జులై 20(ప్రజాక్షేత్రం):**




మేడ్చల్లో వినూత్న నిరసన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు... రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వరి నాట్లు వేసి అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు..... మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 297 డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో దెబ్బతిన్న రోడ్లు, గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... మేడ్చల్ మున్సిపాలిటీని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో విలీనం చేసినప్పటికీ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి, స్థానికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెవిలో దూరిన పురుగు... అరగంట శ్రమించి బయటకు తీసిన ఆర్ఎంపీ డాక్టర్

- **కోటగిరి మండల కేంద్రంలో ఘటన**
- **పెను ప్రమాదం తప్పిందని తెలిపిన ఆర్ఎంపీ డాక్టర్.సాయ గౌడ్**

**కోటగిరి,జులై 20(ప్రజాక్షేత్రం):**



కోటగిరి మండల కేంద్రానికి చెందిన గోపాలమిత్ర రాము డ్యూటీ కి వెళ్తుండగా ఓ పెద్ద పురుగు అకస్మాత్తుగా తన చెవిలోకి దూరింది. పురుగు చెవిలో దూరిన వెంటనే ఇంటికి చేరుకున్న అతను బోధన్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సంప్రదించగా ఆదివారం కావడంతో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక కోటగిరి మండల కేంద్రంలో ప్రాక్టీస్ చేసే ఆర్ ఎం పి డాక్టర్. సాయ గౌడ్ వద్దకు వెళ్లి విషయం తెలుపగా ఆయన చెవిలో దూరిన పురుగును పరిశీలించి అరగంట పాటు తీవ్రంగా శ్రమించి గ్లూకోజ్ నీళ్లతో చెవిలో సిరంజి ద్వారా పంపి అతి జాగ్రత్తగా ఆ కీటకాన్ని బయటకు తీశారు. అప్పటివరకు నొప్పితో విలవిలలాడిపోయిన గోపాలమిత్ర రాము కీటకాన్ని బయటకు తీసిన డాక్టర్ సాయ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయ గౌడ్ మాట్లాడుతూ... చెవిలో దూరిన పురుగు చాలా పెద్దగా ఉందని ఆయనకు పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. చెవిలోకి గ్లూకోజ్ వాటర్ ఇంజక్షన్ ద్వారా స్ప్రే చేసి అతి కష్టం మీద జాగ్రత్తగా కీటకాన్ని బయటకు తీసినట్లు చెప్పారు. ఆ కీటకాన్ని బయటకు తీయడం ఆషామాషీ విషయం కాదని స్థానికంగా ఉండి ప్రజలకు అత్యవసర సేవలు అందించే ఆర్ఎంపి, పి.ఎం.పి డాక్టర్ల సేవలను ప్రజలు గుర్తించాలని కోరారు.



## ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ అవసరం..

- **వ్యవసాయం కంటే ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి...**
- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**
- **నీటి పొదుపు.. ఉపాధి హామీ పనుల విస్తరణపై అధికారులకు సూచనలు**

**వనపర్తి , జూలై 20 (ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ వ్యవసాయ పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్‌నినో నిపుణుల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సూచించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో పరిస్థితులు, ఋతుపవనాల ప్రభావం, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించేలా రైతులకు సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గే అవకాశమున్నందున ఉపాధి హామీ పథకం కింద పెద్దఎత్తున పనులు చేపట్టి అవసరమైతే అదనపు పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించి వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
పశువులకు తాగునీరు, మేత కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, మేత విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని, ప్రకృతి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.రైతులు పంట బీమా పథకాలలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.
ప్రకృతి వైపరీత్యాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి ఎల్‌నినో ప్రభావాన్ని సమిష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.
సమీక్ష సమావేశంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రూ.90.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన.

**శంషాబాద్, జులై20( ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా నేడు రెండు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన జరిగింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ.90.20 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు రూ.67.80 లక్షల వ్యయంతో రాజేంద్రనగర్ డివిజన్ న్యూగ్రీన్ సిటీ కాలనీ (వార్డ్ నెం.120) లో నూతన సీసీ రోడ్డు నిర్మాణం.రూ.22.40 లక్షల వ్యయంతో రాజేంద్రనగర్ డివిజన్లోని బుద్వేల్ సిగ్నేచర్ అపార్ట్మెంట్ సమీపంలో (వార్డ్ నెం.120) మరో సీసీ రోడ్డు నిర్మాణం.ఈ అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు,ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ బుడుముల యాదగిరికి జాతీయ ఉత్తమ కౌన్సిలర్ అవార్డు

**మహేశ్వరం, జూలై 20(ప్రజా క్షేత్రం):**

జల్‌పల్లి మున్సిపాలిటీ 16వ వార్డు మాజీ కౌన్సిలర్ బుడుముల యాదగిరికి జాతీయ స్థాయి 'బెస్ట్ కౌన్సిలర్' అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నాచారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందిన యాదగిరి, ఐదేళ్ల పదవీకాలంలో ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వంటి సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
అవార్డు అందుకున్న సందర్భంగా బుడుముల యాదగిరిని పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, అభిమానులు అభినందించారు. ఆయన మరింతగా ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.



# అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..!

- **నోటీసులకే పరిమితమవుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు?**
- **ప్రభుత్వ ఆదాయానికి గండి..**
- **చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.**

**కాప్రా, జూలై 20(ప్రజా క్షేత్రం):**









మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లో భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి స్టిల్ట్ ప్లస్-2 లేదా జీ ప్లస్-2 వరకు మాత్రమే అనుమతులు పొందిన భవనాలకు అదనంగా మరో పెంట్‌హౌస్‌లు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
డివిజన్‌లో ఇటీవల భారీ సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్న భవనాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారని, ఆ తర్వాత నిర్మాణాలను నిలిపివేయడం, సీజ్ చేయడం లేదా కూల్చివేయడం వంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణదారులు ఎలాంటి భయం లేకుండా పనులు పూర్తి చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తుల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన అభివృద్ధి రుసుములు, అనుమతి ఫీజులు తదితర ఆదాయం కోల్పోతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేపడుతున్న వారు అధిక వ్యయం భరిస్తుండగా, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
అధిక అంతస్తుల నిర్మాణాలతో కాలనీల్లో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు, మురుగు నీటి పారుదల, తాగునీటి సరఫరాపై అదనపు భారం పడుతోందని నివాసితులు చెబుతున్నారు. అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైతే రక్షణ చర్యలు చేపట్టడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
చర్లపల్లి డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు బహిరంగంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా? నోటీసులకే పరిమితమవుతున్నారా? లేక ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి జరిగిన ఆదాయ నష్టాన్ని వసూలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారుల పాత్రపైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే ఇటువంటి ఉల్లంఘనలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.



## ప్రతి ఇంటి పరిశుభ్రతతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

- **కోటగిరి మండల సర్పంచుల పోరం అధ్యక్షులు బర్ల మధుకర్**
- **గ్రామంలో పిచ్చి మొక్కలను జెసిబితో తొలగించిన సర్పంచ్ మధుకర్**

**కోటగిరి,జులై 20(ప్రజాక్షేత్రం):**

ప్రతి ఇంటి పరిశుభ్రతతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ అన్నారు.వర్ష కాలం దృష్ట్యా కోటగిరి గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ గ్రామంలో మురికి కాలువలు శుభ్రపరుస్తూ,ప్రభుత్వ స్థలాలు భవనాల వద్ద పేరుకుపోయిన ముళ్ళ పొదలతో పాటు పిచ్చి మొక్కలను సోమవారం జేసిబి, సహాయంతో తొలగించారు. అందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంతో పాటు అంగన్వాడి భవనం ద్వాక్రా మహిళా సంఘ భవనం ,ప్రాథమిక పాఠశాల చుట్టుపక్కల పేరుకుపోయిన ముళ్ళ పొదలతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ మీడియాతో మాట్లాడుతూ... కోటగిరి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తన లక్ష్యమని అందుకే ప్రతి కాలనీలో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత చేపడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో ప్రజలకు దోమల వల్ల రోగాలు రాకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలోని మురికి కాలువలు పూర్తిగా శుభ్రపరచడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణలో పేరుకుపోయిన ముళ్లపొదలతో పాటు పిచ్చి మొక్కలను సైతం తొలగించడం జరుగుతుందన్నారు. ఐకెపి కార్యాలయం వద్ద గల పలు ప్రభుత్వ భవనాల చుట్టూ ఎన్నో ఏళ్లుగా పెరిగిన పిచ్చి మొక్కలను శుభ్రపరచడం జరిగిందన్నారు. ఈ శుభ్రపరిచిన స్థలంలో కంచెను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అందులో మొక్కలను నాటి సంరక్షించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఎవరి ఇంటి ముందు వారు శుభ్రపరచుకుంటే ఆ ఇల్లు పరిశుభ్రంగా ఉండి గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా ముళ్ళ పొదలు,పిచ్చి మొక్కలుంటే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువస్తే జెసిబి సహాయంతో ఆ పిచ్చి మొక్కలను తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి మాట్లాడుతూ... అంగన్వాడి భవనం వెనుక ఎక్కువగా పెరిగి భయంకరంగా మారిన ముళ్లపొదలు తొలగించి శుభ్రపరచినందుకు గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ కు ధన్యవాదాలు తెలిపారు.సర్పంచ్ బర్ల మధుకర్ వెంట కోటగిరి గౌడ సంఘం అధ్యక్షులు శంకర్ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది. అయూబ్ ఖాన్, తదితరులున్నారు.

## కౌన్సిలర్ తండ్రి మృతికి ఎమ్మెల్యే జీఎంఆర్ నివాళి

**దేవరకద్ర, జూలై 20(ప్రజా క్షేత్రం):**



దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని బలుసుపల్లి గ్రామానికి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ అరుణ-చంద్రమౌళి తండ్రి పుట్ట బాలప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) సోమవారం వారి నివాసానికి వెళ్లి బాలప్ప భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలప్ప ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఏ లు సమర్థవంతంగా పని చేయాలి: కెఎల్‌ఆర్

- **క్షేత్రస్థాయిలో ఆగస్టు 3వరకు కష్టపడి పనిచేయాలి కేఎల్‌ఆర్**

**మహేశ్వరం జులై 20: ప్రజాక్షేత్రం)**

ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ను బూత్ స్థాయిలో పని చేసి ప్రతి ఓటర్, ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్స్ ను అందించాలని 17 మంది ఇన్చార్జులు, 4గురు అబ్జర్వర్స్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.టీపీసీసీ అబ్జర్వర్ జగదీష్, సర్ నియోజకవర్గం ఇన్చార్జి దేప భాస్కర్ రెడ్డితో కలిసి తుక్కుగూడ కార్యాలయంలో మండల ఇన్చార్జులు, సర్ - బిఎల్‌ఏ లు, అబ్జర్వర్స్ తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.
ఈ సందర్భంగా అబ్జర్వర్ జగదీష్ మాట్లాడుతూ... సర్ తో తప్పుల తడకలు, దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. ఇన్చార్జులపై అబ్జర్వర్స్ ను పెట్టడం వల్ల ప్రతీ ఇంటికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వెళ్తుందని చెప్పారు.
ప్రతీ ఇన్చార్జి, అబ్జర్వర్ కనీసం 25 ఇళ్లకు రోజూ వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఇవాళ సాయంత్రం, రేపు, ఎల్లుండి బూత్ స్థాయి, ఇన్చార్జులతో క్షేత్రస్థాయి పర్యటన చేయాలని కిచ్చెన్నగారు అబ్జర్వర్స్ కు చెప్పారు. సీఎం సూచనలను వివరించారు. నియోజవర్గం స్థాయిలో సర్ అబ్జర్వర్స్ గా దేప భాస్కర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, బొక్క జంగారెడ్డిని నియమించారు. 17 మంది డివిజన్ అధ్యక్షులు, మరో 17 మంది అబ్జర్వర్స్, 540 మంది బూత్ స్థాయి బిఎల్‌ఏ లతో ఓటర్ సమగ్ర సవరణ బాధ్యతలను కో ఆర్డినేట్ చేసుకోవాలని 98 మంది సర్ ఇన్చార్జులకు కేఎల్‌ఆర్ సూచించారు. ఆగస్టు 3 వరకు ఓటర్ సమగ్ర సవరణలోనే పని చేయాలని స్పష్టం చేశారు.



## నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్ లక్ష్మమ్మ

- **విద్యార్థిని విద్యార్థులకు నులిపురుగుల మందులు వేసిన సర్పంచ్ లక్ష్మమ్మ**

**మహేశ్వరం జులై 20: (ప్రజాక్షేత్రం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ.... నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు మందులు వేసిన అనంతరం మధ్యన భోజన పథకంలో పాల్గొని విద్యార్థిని విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది అనంతరం అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకోవడం తో విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారని పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని అన్నారు మరియు బాత్రూమ్స్ వాటర్ కిచెన్ సరిగా లేదని తెలిపారు దీనిపై స్పందించి దీనికి సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తానని గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ తెలియజేశారు ఈ కార్యక్రమంలో.. గ్రామపంచాయతీ కార్యదర్శి వేణు, ఆశ వర్కర్ మమత, ఉపాధ్యాయులు, ఆయమ్మ తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ తెలియజేశారు



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
21.07.2026
మంగళవారం | హైదరాబాద్



## ప్రజావాణి ఫిర్యాదులపై ఎస్పీ సునిత రెడ్డి సత్వర స్పందన

- **జాప్యానికి తావులేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి**
- **17 ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి అధికారులకు ఆదేశాలు**
- **బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలంటూ స్పష్టమైన సూచన**

**వనపర్తి, జూలై 20 (ప్రజాక్షేత్రం ):**

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 17 మంది ఫిర్యాదుదారుల నుంచి ఆమె నేరుగా వినతులు స్వీకరించారు.

ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులపై చట్టబద్ధంగా, పారదర్శకంగా, వేగవంతంగా విచారణ చేపట్టి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని సున్నితంగా పరిశీలించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటికి సత్వర పరిష్కారం చూపడమే ప్రజావాణి ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి కేసులో బాధ్యతాయుతంగా స్పందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎస్పీ తక్షణ స్పందన, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలకు త్వరలోనే న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగిందని పేర్కొన్నారు.

**ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు**

భార్యాభర్తల వివాదాలు - 3 భూ వివాదాలు - 5 పరస్పర గొడవలు - 9 మొత్తం 17 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

## ప్రాణాలు నిలవకపోయినా.. అవయవాలతో పలువురికి జీవం

**ఘట్‌కేసర్, జూలై 20(ప్రజా క్షేత్రం):**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తిని వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించగా, ఆయన కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో అవయవదానానికి అంగీకరించారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధేనువకొండ గ్రామానికి చెందిన గుంజి శ్రీను (40) ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో నివాసం ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్నారు. ఈ నెల 17న పనినిమిత్తం వెంకిరాల గ్రామానికి వెళ్లిన ఆయన, పని ముగించుకుని కూలీలను ఔషాపూర్ బ్రిడ్జి వద్ద దింపిన అనంతరం రాత్రి 8.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఔషాపూర్‌లోని దీక్ష హోటల్ సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపై స్కిడ్ కావడంతో శ్రీనుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తొలుత బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని



కామినేని ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 11.43 గంటలకు వైద్యులు ఆయనను బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు.తీవ్ర విషాదంలోనూ సమాజానికి మేలు చేయాలనే సంకల్పంతో మృతుడి భార్య గుంజి శ్రావణి, కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. వారి నిర్ణయంపై వైద్యులు, పోలీసులు అభినందనలు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఔషాపూర్‌లో పేకాటపై పోలీసుల దాడి.. ఆరుగురు డ్రైవర్లు అరెస్ట్!

**ఘట్‌కేసర్, జూలై 20(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్ -మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఔషాపూర్ గ్రామంలోని హెచ్‌పీసీఎల్ వెహికల్ పార్కింగ్ ఆవరణలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఆరుగురు డ్రైవర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,370 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, రెండు పేకాట సెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం ఔషాపూర్ గ్రామంలోని హెచ్‌పీసీఎల్ వెహికల్ పార్కింగ్ ఆవరణలో కొందరు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి బహిరంగంగా పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఘట్‌కేసర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఆరుగురు డ్రైవర్లు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.

నిందితుల వద్ద నుంచి రూ.7,370 నగదు,




రెండు పేకాట సెట్లు, ఆరు మొబైల్ ఫోన్లను పోలీసులు జప్తు చేశారు. అనంతరం వారిని ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, చట్టవిరుద్ధంగా జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇద్దరం రిలేషన్‌లో ఉన్నాం.. ఆమెనే నా రూమ్‌కు వచ్చింది..

- **ట్రైనీ ఐపీఎస్ సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు.!!**

**హైదరాబాద్ జులై 20(ప్రజాక్షేత్రం):**

ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి కేసు సరికొత్త మలుపు తిరిగింది. ప్రస్తుతం ఎర్రగడ్డలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన పరిస్థితి విషమంగా ఉండగా.. ఘటనకు ముందు ఆయన రాసిన సూసైడ్ నోట్ సంచలనంగా మారింది. అందులో తన ఆత్మహత్యకు నలుగురు కారణమని పేర్కొంటూ, సదరు మహిళా అధికారితో ఏడాదిగా ఉన్న రిలేషన్ గురించి కీలక విషయాలను ప్రస్తావించారు.


హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల ఆరోపణల కేసు ఊహించని మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ప్రస్తుతం ఆయనను ఎర్రగడ్డలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ ఘటనకు ముందు ఉదయ్ కృష్ణారెడ్డి రాసిన సూసైడ్ నోట్ ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ లేఖలో ఆయన పలు కీలక విషయాలను ప్రస్తావించారు.

**సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు..!**

తన ఆత్మహత్యకు నలుగురు వ్యక్తులు కారణమంటూ ఉదయ్ కృష్ణారెడ్డి తన సూసైడ్ నోట్‌లో తెలిపారు. "నా తోటి బ్యాచ్‌మేట్‌తో గత ఏడాది కాలంగా నేను రిలేషన్‌లో ఉన్నాను. పెళ్లి జరిగిన తర్వాత కూడా మా మధ్య ఈ రిలేషన్ కొనసాగింది. ఆమె తనంతట తానుగానే నా రూమ్‌కు వచ్చేది. దీనికి సంబంధించిన పూర్తి వీడియో ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు నా మొబైల్ ఫోన్‌లో భద్రంగా ఉన్నాయి. ఈ విషయాన్నే సదరు మహిళా ట్రైనీ ఐపీఎస్ భర్తకు కూడా నేను స్వయంగా వివరించాను. నా దగ్గరున్న ఆధారాలన్నీ నా ఫోన్‌లోనే ఉన్నాయి" అని ఉదయ్ కృష్ణారెడ్డి ఆ లేఖలో సంచలన నిజాలను బయటపెట్టారు.

**అసలు కేసు నేపథ్యం ఏమిటి..?**

కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వివాదం వెలుగు చూసింది. ఉదయ్ కృష్ణారెడ్డి తనకు అసభ్యకర




సందేశాలు పంపుతూ వేధించాడని, అంతటితో ఆగకుండా గదిలోకి లాక్కెళ్లి జుట్టు పట్టుకుని గొంతు నులిమి, మెడపై కత్తిపెట్టి ప్రాణ బెదిరింపులకు గురిచేశాడని ఆమె ఫిర్యాదులో తెలిపారు. అలాగే తన వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసి, వాటిని తన భర్తకు పంపుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు ఎన్‌పీఏ ప్రివిలేజ్ కమిటీ ప్రాథమిక విచారణ చేపట్టి.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా అధికారిణి ఆరోపణల్లో నిజముందని నిర్ధారించడంతో ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది.




## చిన్నపాటి వర్షా నికే రోడ్డు దుస్థితి..!

- **రోడ్డు కాదు... ప్రమాదాల వేదిక..!**
- **అభివృద్ధి మాటల్లో కాదు... రోడ్లపై కనిపించాలి.**

**రాయికల్, ప్రజాక్షేత్రం :**

చిన్నపాటి వర్షానికే రామజీపేట నుండి రాయికల్ వెళ్లే రోడ్డంతా గుంతలు, నీటితో నిండిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రయాణం. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫోటోగ్రాఫర్స్ భవన నిర్మాణానికి సహకరించాలని నాయకులకు విజ్ఞప్తి

**గజ్వేల్, ప్రజాక్షేత్రం:**

గజ్వేల్ మండల ఫోటోగ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో ఫోటో భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి సహకరించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు నాగరాజు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ రెడ్డి తదితరులను కలిసి ఫోటోగ్రాఫర్స్ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అలాగే తమ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధుల ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు సహకరించాలని సంఘం తరఫున విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రతి ఒక్క నాయకుడి నుంచి సానుకూల స్పందన లభించిందని గజ్వేల్ మండల ఫోటోగ్రాఫర్స్ సంఘం అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.




## కుకునూర్‌పల్లిలో జూలై 22న గ్రామసభ

**కుకునూర్‌పల్లి, ప్రజాక్షేత్రం:**

కుకునూర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద జూలై 22, 2026 బుధవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ మల్లం కనకవ్వ తెలిపారు.

గ్రామసభలో ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట మార్పిడి, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్యం, పిల్లలను బడిలో చేర్పించడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ గ్రామసభకు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ అధికారులు, ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేయాలని సర్పంచ్ మల్లం కనకవ్వ కోరారు.

## తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్రను విస్మరించొద్దు

- **- అసలైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి**
- **- విద్యార్థి, యువ ఉద్యమకారులను విస్మరించడం బాధాకరం**
- **ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ**

**షాద్ నగర్ జులై 20(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ ఉద్యమంలో నిజంగా పోరాడిన ఉద్యమకారులకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో అసలైన ఉద్యమకారులను విస్మరించడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంఆర్పీఎస్, మాదిగ ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని, ఆ విషయాన్ని నాయకులు మర్చిపోవద్దని పేర్కొన్నారు.

వేదికపై సన్మానం పొందిన వారిలో ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిన్న వారు, కేసులు ఎదుర్కొన్న వారు ఎంతమంది ఉన్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యమంలో ముందుండి పోరాడిన విద్యార్థి నాయకులు, యువతకు గుర్తింపు లేకపోవడం విచారకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అత్యధికంగా నష్టపోయింది యువతేనని, అలాంటి వారిని పక్కన పెట్టి కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని విమర్శించారు. ఇకనైనా టీజేఏసీ నాయకులు, నిర్వాహకులు నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని పెంటనోళ్ల నరసింహ మాదిగ కోరారు.

## వికలాంగురాలికి కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు రద్దు చేయొద్దు

- **కలెక్టర్‌కు ప్రజావాణిలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, డీఎస్‌ఎస్ నాయకుల వినతి**

**సిద్దిపేట, ప్రజాక్షేత్రం, జూలై 20:**

రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన శారీరక వికలాంగురాలు బొమ్మ మల్లమ్మకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని కొనసాగిస్తూ, ఆమెకు న్యాయం చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్), ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, డీఎస్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బొమ్మ మల్లమ్మ మాట్లాడుతూ.. యాదవ సామాజిక వర్గానికి చెందిన తాను పుట్టుకతోనే పోలియో కారణంగా రెండు కాళ్లు పనిచేయని పరిస్థితిలో ఉన్నానని తెలిపారు. గత ఐదారు సంవత్సరాలుగా రాంసాగర్ గ్రామంలో నివసిస్తున్నప్పటికీ, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం పలుమార్లు దరఖాస్తు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులకు వినతులు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

ఇటీవల ఎమ్మార్పీఎస్ నాయకుల చొరవతో తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించారని, అయితే ప్రస్తుతం గ్రామంలోని కొందరు వ్యక్తులు, నాయకులు ఆ ఇంటిని తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తనకు కేటాయించిన గృహాన్ని రద్దు చేయకుండా రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరారు.

వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ వికలాంగులకు చట్టపరంగా కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలలోని రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, బొమ్మ మల్లమ్మకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని కొనసాగిస్తూ పూర్తి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394